
బీచుపల్లిలో సరస్వతి ఆలయంలో ధాన్యలక్ష్మి అలంకరణలో సరస్వతిదేవి


ధరూరులో కాళికాదేవి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనం


గట్టులోని భవానీమాత దుర్గాదేవిగా భక్తులకు దర్శనం..


శాంతినగర్‌లో వాసవికన్యకా పరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవిగా దర్శనం..


అయిజలోని కాళికాదేవి ఆలయంలో దుర్గా దేవిగా..


బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో దుర్గామాత అలంకరణలో..


రాజోళిలో మహిషాసురమర్దిని అవతారంలో అమ్మవారు..

క్లుప్తంగా

సింహ వాహనంపై ఊరేగింపు..

అయిజ: పట్టణ సమీపంలోని స్వయంభు కట్ట కింద తిమ్మప్ప స్వామి ఆలయంలో మంగళవారం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో శ్రీదేవి, భూదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామివారి ఉత్స విగ్రహాలను సింహ వాహనంపై ఊరేగించారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

యువతి ఆత్మహత్య


కీర్తన (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: పురుగుల మందు తాగి ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎర్రవల్లి మండలం దువాసపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవ వివరాల మేరకు.. దువాసపల్లికి చెందిన కీర్తన (18) శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. యువతి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని. మృతురాలి తల్లి పుష్పమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గట్టు: వరి పొలానికి నీరు పారించేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాత పడిన ఘటన గట్టు మండలం వాయిల్‌కుంటతండాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వాయిల్‌కుంటతండాకు చెందిన రైతు వెంకటేష్‌నాయక్ (46) అరెకర పొలంలో వరి, మరో అరెకరంలో పత్తి సాగు చేస్తున్నాడు. వరిపంటకు నీరు తక్కువ పడుతున్న క్రమంలో పక్క రైతు రంగస్వామి బోరుబావి నుంచి నీటిని పారించేందుకు అనుమతి తీసుకున్నాడు. శనివారం రాత్రి వరి పొలానికి నీరు పారించేందుకు పొలానికి వెళ్లిన అతడు.. పొలం గెట్టుపై ఉన్న సర్వీస్ వైర్‌ను చీకట్లో గమనించకుండా తొక్కడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నీలమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ విజయ్‌కుమార్ రైతు కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మాచర్లలో లిక్కర్ సీసాలు స్వాధీనం

గట్టు: మండలంలోని మాచర్లలో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి, 20 లిక్కర్ సీసాలు, 10 బీరు సీసాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్, ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు. ఎక్సైజ్ సీఐ గోపాల్, ఎస్‌ఐ రాజేందర్‌ల కథనం మేరకు.. మాచర్లలో ఎక్సైజ్ అధికారులు కలిసి సోదాలను నిర్వహించినట్లు తెలిపారు. సోదాల్లో గ్రామానికి చెందిన బోయ చెన్నప్ప, కుర్వ భీమన్న అనే వ్యక్తుల ఇండ్లలో 20 లిక్కర్ సీసాలు, 10 బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురు అధ్యాపకులకు డాక్టరేట్

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ముగ్గురు అధ్యాపకులకు డాక్టరేట్ లభించింది. జంతు శాస్త్ర విభాగంలో హరినాథ్, వృక్షశాస్త్ర విభాగంలో గణేష్, ఇంగ్లిష్ విభాగంలో కుమారస్వామి పరిశోధనలు సమర్పించనందుకు గాను గ్లోకల్ విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాష, వైస్ ప్రిన్సిపల్ శ్రీపతినాయుడు, అధ్యాపక బృందం తదితరులు వారిని అభినందించారు.

ప్రతిఎకరాకు సాగునీరు అందించాలి

అలంపూర్: ప్రతి ఎకరాకూ సాగు నీరు అందించాలని బీఎస్పీ జిల్లా కార్యదర్శి మహేష్ అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇమాంపురం సమీపంలోని ఆర్డీఎస్ కాలువలను, ఎండిన పంటలను బీఎస్పీ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ సరైన వర్షాలు లేక రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. నియోజకవర్గంలో వేసిన పంటలు ఎండి పెట్టుబడులు రాక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో సురేష్, నాగరాజు ఉన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి


బతుకమ్మలతో ధరూరు చెరువుకు వెళ్తున్న సరిత, బండ్ల లక్ష్మీదేవి

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని షేకుపల్లిలో సర్పంచ్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మందా జగన్నాథం హాజరయ్యారు. ఎంపీపీ స్నేహ, మహిళలు, చిన్నారులతో డప్పు వాయిద్యాల నడుమ బతుకమ్మలను ఊరేగింపుగా దేవాలయం దగ్గరికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు హనుమంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్సీ

ఎర్రవల్లి మండల కేంద్రంలోని శివాంజనేయస్వామి ఆలయాన్ని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

అలంపూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేద్దామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. కర్నూల్‌లోని నివాసంలో ఎమ్మెల్సీ చల్లా నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు ఆదివారం కలిసినట్లు తెలిపారు. మండలాల నాయకులు ఆయనని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

ధరూరు: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన బతుకమ్మ సబరాలు అంబరాన్నంటాయి. ఆయా గ్రామాల నుంచి తరలి వచ్చిన మహిళలతో గ్రామంలో సందడి నెలకొంది. వైఎస్సార్ చౌరస్తా వద్ద బతుకమ్మలతో మహిళలు స్వాగతం పలికారు. కే.శే. గాండ్ల వీరప్ప స్టేడియంలో నిర్వహించిన బతుకమ్మల సంబరాల్లో జెడ్పీ చైర్ పర్సన్ సరిత, మాజీ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవమ్మ పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ బొడ్డెమ్మలు ఆడారు. కార్యక్రమంలో ఎంపీపీ నజీమున్నీసా బేగం, మాజీ జెడ్పీటీసీ కర్రెన్న, కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి


బీచుపల్లి బెటాలియన్‌లో దుర్గమ్మకు పూజలు


రాజోళిలోని పెట్రోల్ పంపులో పూజ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో దుర్గమ్మ ఆలయాన్ని ఆదివారం బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య సందర్శించారు. ఈ సందర్భంగా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బెటాలియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కమాండెంట్ ప్రారంభించారు. దుర్గామాత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఎర్రవల్లి మండల ప్రజలతో పాటు బెటాలియన్ సిబ్బంది, కుటుంబ సభ్యులపై ఉండాలని కమాండెంట్ కోరుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగభూషనం, ఆర్‌ఐలు రాజు, రాజారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆయుధపూజ

రాజోళి: దసరాను పురస్కరించుకుని ముందు రోజు చేసే ఆయుధ పూజ మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ట్రాక్టర్లు, బైక్‌లు, జేసీబీలు, తదితర వాహనాలను అమ్మవారి ముందు ఉంచి ప్ర త్యేక పూజలు చేశారు. పెట్రోల్ పంపులు, కిరాణ షాపులు వ్యాపార సముదాయాల్లో విశేష పూజలు చేయించారు. ఆలయాల్లో మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

ఎర్రవల్లిచౌరస్తా: మండల కేంద్రంలోని ఎర్రవల్లి కూడలిలో దసరా పండగను పురస్కరించుకొని ఆదివారం వివిధ దుకాణాలు జనాలతో రద్దీగా మారాయి. దీంతో చౌరస్తాలో ఎక్కడ చూసినా జనసంద్రం, పండగ వాతావరణం, సందడిగా కనిపించింది.

కిటకిటలాడిన వ్యాపార సముదాయాలు

రాజోళి: దసరా పండుగను పురస్కరించుకుని పలు వ్యాపార సముదాయాలు కిటకిటలాడాయి, మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు బట్టలు, కూరగాయలు, వంట సామగ్రి కొనుగోలు చేసేందుకు రాజోళి, శాంతినగర్ తదితర పట్టణాలకు రావడంతో జనాలు కిక్కిరిసి కనిపించారు.

కాంగ్రెస్ అంటేనే కరెంట్ కష్టాలు


అరగిద్దలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గద్వాల రూరల్: కాంగ్రెస్ అంటేనే కరెంట్ కష్టాలు గుర్తుకు వస్తాయని, ఆ పార్టీ నాయకుల మాయ మాటలను నమ్మొద్దని, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమాభివృద్ధి పథకాలకు ఆకర్షితులై కేటీదొడ్డి మండలానికి చెందిన పలువురు పార్టీలో చేరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆదివారం ఆయన నివాసంలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో భీమన్న, హనుమంతు, ఉరుకుందు పాల్గొన్నారు.

గట్టు: ఇంటింటికి కృష్ణన్న కార్యక్రమం ఆరగిద్ద గ్రామంలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, ఎమ్మెల్యే కుమారుడు సాయిసాకేత్‌రెడ్డిలు నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం అన్నీ వర్గాలకు సంక్షేమ పథకాలను అందించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యోగేశ్వరి, ఎంపీటీసీ లక్ష్మి, మాచర్ల సర్పంచ్ సిద్దిరామప్ప, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో అగ్నిప్రమాదం

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాలలోని ఓ గదిలో నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే గదిలోని ఫర్నిచర్ ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. మరో గదిలో పాఠశాల రికార్డులు ఉన్నాయని, ఆ గదిలోకి మంటలు వ్యాపించి ఉంటే పెద్ద నష్టం జరిగేదని హెచ్‌ఎం శివప్రసాద్ తెలిపారు. పాఠశాలలో ఆకతాయిలు, మద్యం బాబులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. 10 రోజుల కిందట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

బహుజన వాదాన్ని బలపరచండి

ధరూరు: దశాబ్దాల తరబడిగా సంపన్న వర్గాల చేతిలో చిక్కుపోయిన అధికారాన్ని గద్దె దించే సమయం వచ్చిందని, ప్రతి ఒక్క ఓటరు బహుజన వాదాన్ని బలపరచాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్, ఏఐఎఫ్‌బీ బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి గొంగ్లళ్ల రంజిత్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని ఎములోనిపల్లి, పెద్దపాడు గ్రామాల్లోని ఆయా కాలనీల్లో తిరుగుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తనకు కేటాయించిన సింహం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు బుచ్చిబాబు, గోవిందు, లవన్న, మల్దకల్, అడివిల ఆంజనేయులు, పరుశరాం, జగదీష్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

గద్వాల రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ రకాల సంక్షేమాభివృద్ధి పథకాలను చూసి వివిధపార్టీలకు చెందిన పలువురు నాయకులు పార్టీలో చేరినట్లు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఆదివారం ఆమే డీకే బంగ్లాలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గడ్డం కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కిష్టన్న పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన భజన మండలి సభ్యులు

అయిజ: దేవి శరన్నవరాత్రులను పురష్కరించుకొని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో అమ్మ భవానీ దేవస్థాన కమిటీ వారు ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి భజన పోటీల్లో అయిజ మండలం మల్లికార్జున భజన మండలి సభ్యులు ప్రథమ బహుమతి రూ.51వేలు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షుడు సోమన్న, సభ్యులు గురు ప్రసాద్ ఆచారి, సంకాపురం తిమ్మప్ప, ఆంజనేయులు, రాజు, ధర్మవరం రామన్న, నరసింహులు, నారాయణగౌడ్, దేవేందర్, కుమార్, గోవిందు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలి

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ అభ్యర్థి సరిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో గట్టు, కేటీదొడ్డి, మల్దకల్, గద్వాల మండలాలకు చెందిన వారు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గద్వాలలో కుటుంబ పాలనకు స్వస్తి పలుకుదామన్నారు.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం ఆదివారం జోరుగా సాగింది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయా వార్డుల్లో ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి మాట్లాడుతూ సోనియమ్మ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్‌లో ప్రియాంకా గాంధీ డిక్లరేషన్‌లతో ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శాంతినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

ఎంబీ చర్చిలో కోతకాల పండుగ

ధరూరు: మండల కేంద్రంలోని ఎంబీ షాలేము చర్చిలో కోతకాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా పంట కోతదశలో నిర్వించే ఈ కోతకాల పండుగను పుస్కరించుకుని ధరూరులోని క్రైస్తవులు పిండి వంటలు తయారు చేసుకుని ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సందర్భంగా పాస్టర్ రెవ ఆదాం కృతజ్ఞతల అర్పణల పండుగను గూర్చి బైబిల్ ప్రవచనాల ఆధారంగా వివరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మహిళా బిల్లును అమలు చేయాలి

గద్వాల అర్బన్: నియోజకవర్గాల పునర్విభజనతో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లులను అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద డిమాండ్ చేశారు. ఐద్వా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేస్తామని చెబుతూ మహిళలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ నాయకులు నర్సమ్మ, యాస్మీన్, రేణుక, లక్ష్మి, జయమ్మ ఉన్నారు.

కుల గణన చేపట్టాలి

గద్వాల అర్బన్: కులగణన చేపట్టి అన్ని కులాలు, వర్గాల లెక్క తెల్చి న్యాయం చేయాలని బహుజన రాజ్యసమితి నాయకులు వాల్మీకి, కోళ్ల హుస్సేన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు వినోద్ కుమార్, శివ, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

శంకరన్ సేవలు మరువలేనివి

అలంపూర్: గురుకుల పాఠశాల స్థాపనలో శంకరన్ చేసిన సేవలు మరువలేనివని స్వేరోస్ జిల్లా కార్యదర్శి రమేష్ అన్నారు. పట్టణంలోని సంతోష్ నగర్‌లో స్వేరోస్ అధ్వర్యంలో మాజీ ఐఏఎస్ ఎస్‌ఆర్ శంకరన్ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేరోస్ నాయకులు శంకరన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. జీవితాంతం పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు మహేష్, కనకం బాబు, నాగరాజు, సురేష్, వెంకటేశ్వర్లు, మునిస్వామి ఉన్నారు.

భాగవత పారాయణం

ధరూరు: దేశం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ మండల కేంద్రంలోని శివాలయంలో 7 రోజులుగా భాగవత పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది సరైన వర్షాలు లేక రైతులు అల్లాడిపోతున్నారని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివాలయం కమిటీ, గ్రామ పెద్దలు జయమోహన్‌రెడ్డి, రంగన్న, సత్యన్న, సత్యారెడ్డి, జాంపల్లి, నర్సింహులు, విక్రంసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

సరిహద్దులపై పోలీస్ ఫోకస్

కేటీదొడ్డి: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెక్‌పోస్ట్ సీఐ నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలు క్షుణంగా తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేని నగదు బంగారాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా..

గట్టు: అవకాశమిస్తే అభివృద్ధి చేస్తానని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి ఆరగిద్దలో ప్రజాచైతన్య యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ నడిగడ్డ ప్రాంతంలో బహుజన వాదాన్ని నిలబెట్టాలని, ప్రజల తరపున ప్రశ్నించే గొంతుకగా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద వర్గాల తరఫున అభివృద్ధి సంక్షేమం, ఆత్మగౌరవం కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నడిగడ్డ హ క్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శి లవన్న, హనుమంతు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

అయిజ: పట్ట పగలు పంటపొలంలో యువకుడి గొంతుకోసి దారుణంగా హత్య చేసిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చిన్న తాండ్రపాడుకు చెందిన నాయికంటి సుధాకర్ ఆదివారం తమ పంటపొలంలో పనిచేసుకుంటూ ఉండగా, గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో దాడిచేసి, హత్యచేశారు. శాంతినగర్ సీఐ శివశంకర్‌గౌడ్, అయిజ ఎస్‌ఐ నరేష్‌కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. హత్యకు వివాహేతర సంబంధం కారణమనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించారు. అతనికి భార్య శాంతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.